# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## మోటర్ల వద్ద పడిగాపులే

- కాంగ్రెస్‌కు అవకాశమిస్తే అంధకారమే
- మూడు గంటల కరెంట్‌తో మునుగుడే
- 10 హెచ్‌పీ మోటర్లు మా నెత్తిన భారమే
- ఆ పార్టీని నమ్మేది లేదు.. ఓటేసేదే లేదు
- 24 గంటల కరెంట్‌తోనే మాకు బతుకు
- కేసీఆర్ సారునే గెలిపించుకుంటం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు

కరీంనగర్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్‌కు అవకాశమిస్తే మళ్లీ ఎనకటి రోజులే వస్తాయని, ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని కరెంట్ కోసం వ్యవసాయ మోటర్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని కర్షకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు వస్తున్న 24 గంటల ఉచిత కరెంట్ పోతుందని, మళ్లీ మూడు గంటలే దిక్కవుతుందని హెచ్చరిస్తున్నారు. నాడు నలభై రెండేండ్ల కాంగ్రెస్ పాలన, పదహారేండ్ల టీడీపీ పాలన చూశామని, యాభై ఎనిమిదేండ్ల సమైక్య పాలనలో ఎవరూ ఇవ్వలేని కరెంటును కేసీఆర్ మాత్రమే ఇచ్చారని స్పష్టం చేస్తున్నారు. ఆనాడు సాధ్యం కానిది ఇవ్వాళ ఎలా సాధ్యమైందంటే.. ఈ ప్రాంత రైతులపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమే కారణమంటున్నారు. సాగునీరు, 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా వంటివి ఇస్తూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా తమకు అండగా నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. డెబ్బై ఆరేండ్ల స్వతంత్ర దేశ చరిత్రలో.. నేటికీ ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్నది కేసీఆర్ మాత్రమే అని ప్రశంసిస్తున్నారు. కొన్నేళ్లుగా కరెంట్ కష్టాలు లేవని, తమకు నచ్చిన సమయంలో వెళ్లి మోటర్లు పెట్టి సాగు చేసుకుంటున్నామని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ నేతలు కరెంట్‌పై పూటకో మాట చెబుతూ పరేషాన్ చేస్తున్నారని, వారిని నమ్మితే మళ్లీ మోటర్ల కాడ జాగారం చేయక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, అందుకే మళ్లీ 3 గంటలు అని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నారని మండిపడుతున్నారు. అసలు కరెంట్ మంచిగున్న చోట మళ్లీ కరెంట్ గురించి ఎందుకు మాట్లాడుతున్నారని, కర్ణాటకలో ఐదు గంటల కరెంటే సక్కగ ఇవ్వకుండా ఇక్కడ ఏం ఉద్ధరిస్తారని ప్రశ్నిస్తున్నారు. సద్ది తిన్న రేవు తలువాలంటే.. మనకు మేలు చేసిన వారికి అండగా నిలువాల్సిన అవసరముందని చెబుతున్నారు. కరెంట్, నీళ్లకు ఏబాధా లేకుండా చేసిన కేసీఆర్ వెంటే తాము స్పష్టం చేస్తున్నారు.

### కాంగ్రెస్ కు అధికారమిస్తే చీకటి రోజులే



నాకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కాంగ్రెస్ పాలనలో కరెంటు లేక ఎన్నో తిప్పలు ఎల్లదీసినం. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియకుండే. 2004లో రెండు బోర్లు వేసినా చుక్క నీరు పడలే. పంటలు సరిగ్గా పండగ రూ.ఐదు లక్షలు అప్పు అయింది. తెలంగాణ వచ్చినంక 24 గంటల కరెంటుతో నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్న. రెండు పంటలు పుష్కలంగా పండుతున్నయి. రైతుబంధు సహాయంతో గతంలోని అప్పులు తీరగా కేసీఆర్ ప్రభుత్వ సహాయంతో సంతోషంగా బతుకుతున్నం. మళ్లీ కాంగ్రెస్ కు అధికారమిస్తే చీకటి రోజులే.

**- కోమ్మనపల్లి మల్లయ్య, రైతు, నర్సింగాపూర్ (చందుర్తి)**

### పండ్లుకాసే చెట్టును నరకున్నట్లే..



కేసీఆర్‌ను కాదని కాంగ్రెస్ వస్తే పండ్లు కాసే చెట్టును నరకున్నట్లు ఉంటుంది. నేను, నా భర్త రాజయ్య కలిసి ఎవుసం చేస్తున్నం. మాకు నర్మాల దగ్గర మూడెకరాల పొలం ఉంది. సీఎం కేసీఆర్ సార్ వచ్చినంక పొలంలో బోరు వేసుకున్నం. మస్తుగా నీల్లు పడ్డయి. నీటికి కొదువ లేకుండా ఎవుసం చేస్తున్నం. మా ఎరుకల మానేరులో నీల్లు లేక ఎండిపోయేది. కానీ కేసీఆర్ సార్ గోదారి జలాలను తెచ్చి మానేరు నింపిండు. దీంతో మేము వేసిన బోర్‌లో నీల్లు మస్తుగా ఉన్నయి. కరెంటు, నీటికి మాకు ఇబ్బంది లేదు. ఎప్పుడైనా పొలం కాడికి పోయి నీళ్లు పారిచ్చుకుంటున్నం. కానీ కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్లు అంటున్రు. ఇది ఎవుసం తెలువని వాళ్లు మాట్లాడే మాటలు. సరిగా ఎవుసం తెలిసినోల్లు ఇలా అనరు. మూడు గంటలు కరెంటు ఇస్తే పారిన మడే మళ్లీ పారుతుంది. మిగతా పొలం ఎండిపోతుంది. గట్లయితే ఏం లాభం. పంటలు ఎండగొట్టుకునేందుకు కాంగ్రెస్ కావాలంటమా... 10 హెచ్‌పీ మోటర్లు అసలే వద్దు. మా పొలాలకు మూడు హెచ్‌పీ మోటర్లు సరిపోతయి. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుని పైసలు ఖర్చు పెట్టుకోమంటరా.. ఇపుడు నడిచే తోవనే మంచిగుంది. మళ్ల కొత్త తొవ్వ ఎందుకు. కేసీఆర్ సార్ వచ్చినంక రైతులంతా మంచిగుంటున్నరు. మళ్ల కేసీఆర్ సార్‌కు ఓటేసి గెలిపించుకుంటం. కాంగ్రెస్ వాళ్ల పాలన వద్దు.. వాళ్ల కరంటు వద్దు.

**- మాడుగుల ఎల్లవ్వ, మహిళా రైతు (గంభీరావుపేట)**

### కాంగ్రెస్ కరెంటు ఇత్తదంటే నమ్ముతమా?



పదేండ్ల కింద మాఊళ్లో ఎవుసం జేసేటోళ్లంతా బయట కూలీ పనులకే పోయిన్రు. బాయిలో నీళ్లున్నా కరెంటుతో గోస పడుడెందుకనుకున్నం. రెండెకరాలు, 5ఎకరాలున్నోళ్లమంతా ఇడిసి పెట్టినం. రాత్రనక, పొద్దనక పొలం కాడనే నీల్గినం. తిన్న కూడు మనసున పట్టకపోయేది. దుక్కులు దున్ని ఇత్తులకు పోతే లైను కడితే రాత్రయినా మావంతు రాలేదు. రెండు రోజులు తిరిగితే కానీ ఎరువులు, విత్తనాలు దొరకలేదు. ఎటన్న పోదామన్నా ఈకరెంటు ఎప్పుడత్తదో తెలువదాయే. ఆటోమెటిక్ స్టాటర్లు అప్పుడెక్కడివి. కరెంటు లేక పొలం ఎండిపోతుందని రైతులందరం కలిసి నాంపల్లి కాడి సబ్‌స్టేషన్‌కు పోయి లొల్లి లొల్లి జేసినం. అక్కడున్న హెల్పర్లను రూములో పెట్టి తాళం వేసినం. అయినా కాంగ్రెస్ గవర్నమెంటు ఏనాడు కరెంటు సక్కగ గియ్యలే. వచ్చిన కరెంటుతోటి మోటరు పెడితే దొయ్యన్న పారలేదు. రైతు జీవితమే వేస్ట్. మా బతుకులే గింతనుకున్నం. తెలంగాణ వత్తేనన్న మంచిగయితదనుకుని ఉద్యమంలో వంట వార్పులు జేసినం. రోడ్లమీద ధర్నాలు చేసినం. కేసీఆర్ పుణ్యమా అని కరెంటు తెల్లందాక పొద్దుందాక ఉంటుంది. ఆటోమెటిక్ స్టాటర్లు పెట్టుకున్నం. నీళ్లు పెట్టిచ్చొనమంటే పొలం మొఖం సూసుడే లేదు. అదే బందైయతంది. అదే చాలైతది. కడుపు నిండా తింటన్నం. పనుంటే ఊర్లపొంటి పొయ్యత్తన్నం. కరెంటు ఉన్నప్పటి నుంచి వడ్లు మంచి దిగుబడి వత్తున్నయ్. సారిచ్చిన రైతు బంధు లాగోడికి పెట్టుకుంటున్నం. ఇంకేం కావాలి మాకు. అన్ని ఇచ్చిన కేసీఆర్ సారును మళ్ల గెలిపించుకుంటం.

**- శ్రీనివాస్‌రెడ్డి, రైతు, అనుపురం, (రాజన్న సిరిసిల )**

### కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంటు గోసలే



నాకు నాలుగెకరాల భూమి ఉన్నది. మొత్తం వరి పంటను సాగు చేస్తున్న. ఉదయం సాయంత్రం పొలానికి నీళ్లు పెట్టి మిగతా సమయంలో వేరే పనికి పోతున్నా. నాడు కాంగ్రెస్ గవర్నమెంటున్నప్పుడు కరెంటు కోసం మస్తుగోస పడ్డాం. వచ్చిరాని కరెంటుతో వ్యవసాయం చేసేందుకు ఎన్నో కష్టాలు ఎల్లదీసినం. తెలంగాణ వచ్చినంక 24 గంటల కరెంటుతో రెండు పంటలు పుష్కలంగా పండించుకుంటూ సమాజంలో గౌరవంగా బతుకుతున్నా. మళ్లీ కాంగ్రెస్ అంటే కరెంటు గోసలే.

**- ఎడమల ఆదిత్యరెడ్డి, రైతు, మర్రిగడ్డ(చందుర్తి)**

### వాల్లత్తె మళ్లీ పాత రోజులే



కాంగ్రెస్ వస్తే మళ్లీ పాతరోజులే, అంధకారంలో ఉండాల్సి వస్తది. కాంగ్రెస్ హయాంలో కరెంటు తిప్పలు అన్నీ ఇన్ని కావు. మూడు గంటల కరెంటు ఎప్పుడు వస్తుందో ఏమో తెలియని పరిస్థితి, ఒక మడికి నీరు అందగా కరెంటు సమయానికి సరిపోక మళ్లీ అదే మడి తడిసేది. దీంతో వ్యవసాయంలో నష్టాలు ఏర్పడి దుబాయ్‌కి వెళ్లాను. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 24 గంటల ఉచిత కరెంటుతో నాకున్న మూడు ఎకరాల్లో సాగు చేసుకుంటూ ఆనందంగా ఉన్న. రైతుబంధు ద్వారా వచ్చిన డబ్బులతో పంట పెట్టుబడి సహాయానికి ఉపయోగించు కుంటున్నా. నాడు దుండుగగా ఉన్న వ్యవసాయం తెలంగాణ ఏర్పడి కేసీఆర్ ప్రభుత్వం వచ్చినాక పండుగైంది.

**-లింగంపల్లి, రైతు, బాబు బండపల్లి(చందుర్తి)**

### కరెంటుకు మళ్ల గోసయితది..



నేను ఆరు ఎకరాలలో వరి, పత్తి సాగుజేత్తున్న. గతంలో మా నాన్న కరెంటుకాడికి పోయేటోడు. నీళ్లు ఉండి కూడా కరెంటు లేక మాకున్న ఎవుసం మొత్తంజేయ్యలేదు. కాంగ్రెసోళ్లు 10హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని, మూడు గంటల కరెంటు సరిపోతుందని అంటున్నరు. అనవసరపు హామీలిస్తూ వాళ్లు ప్రజలను గోసపెట్టవట్టె. సాధ్యం కానీ హామీలు ఇయ్యవట్టె. వాళ్లను నమ్మితే మళ్ల మన బతుకులు చీకట్లకు పోయినట్టే. మళ్ల కేసీఆర్‌నే గెలిస్తేనే రాష్ట్రం ఆగంకాదు. ఎవరో చెప్పిన మాటలు నమ్మి మోసపోవద్దు.

**- అన్నాడి శ్రీనివాస్‌రెడ్డి, యువరైతు, మామిడిపల్లి(కోనరావుపేట)**

### 3 గంటల కరంట్‌తో ఎవుసం దండుగ



నాకు ఉన్న ఎకరంలో ఎవుసం చేస్తున్న. తెలంగాణ ఏర్పడ్డాక కరంటు ఎప్పటికీ ఉంటుంది. కానీ కాంగ్రెసోళ్ల కాలంలో సక్కగా ఉండకపోయేది. రోజుకు ఐదారు సార్లు వచ్చిపోయేది. లోవోల్టేజీతో గా విద్యుత్ మోటర్లు కాలిపోతుండే. వాటి రిపేర్‌కు పైసలు అయి మాకు భారం అయితుండే. అప్పట్లో భూమి ఉండి పంటలు పండించుకున్నా పైసలన్నీ కరెంటుకు, మోటర్లు కాలిపోవుడుకే ఖర్చు అవుతుండే. కానీ నేడు కేసీఆర్ సార్ వచ్చినంక పంటలు మస్తు పండుతున్నయి. కరెంటుకు, నీళ్లకు ఢోకా లేదు. కాంగ్రెస్ 10హెచ్‌పీ మోటర్లు అంటుంది. కానీ అవి కొనడానికి, వైర్లకు బాగా ఖర్చు అవుతుంది. మూడు గంటలు కరెంటు ఒక్క దొయ్య పారడానికి కూడా సరిపోదు. వాళ్లు తెలువక మాట్లాడుతున్నరు. కరెంటు విషయంలో కేసీఆర్ సార్‌ను మించినోల్లు లేరు. 24 గంటల కరెంటు ఇచ్చి రైతులను ఆదుకుంటుండు. రైతుల బాకీలను, బాధలను తీర్చిండు. మేము కేసీఆర్ సార్‌కే మద్దతిస్తం.

**- పూలపల్లి ఎల్లయ్య, రైతు, ముచ్చర్ల (సిరిసిల్ల)**

### మా బతుకులు పొలంలోనే తెల్లారుతయ్



అరవై ఏండ్ల పాలనలో కరెంటు లేక అరిగోసపడ్డం. పొద్దనక, రాత్రనక కరెంటు కోసం కల్లుకాయలు గాసేలా ఎదురుచూసేటోళ్లం. ఎప్పుడు కరెంటు వస్తదో, ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. ఒక్క మడి పారలంటే రెండు మూడు రోజులు పట్టేది. నాకున్న మూడు ఎకరాలు వారం రోజులైన పారేదికాకుండె. మూడు గంటలు మళ్లగిన ఇస్తే మా బతుకులు మళ్ల పొలంలోనే తెల్లారుతయ్. ఎనకటి కాలమే మళ్లీ వస్తది. సీఎం కేసీఆర్ వచ్చినంక నీళ్ల, కరెంటుకు రందీలేకుండున్నం. కాంగ్రెసోళ్లు అధికారంలోకి రాకముందే ఇష్టం వచ్చినట్లు మాట్లాడవట్టె. వాళ్లు గెలిచిది లేదు, సచ్చేది లేదు. మళ్ల కేసీఆరే సీఎం అయితడు. మాలాంటి రైతుల కష్టాలను తీర్చుతడు.

**- జంగం శంకర్, రైతు, బావుసాయిపేట(కోనరావుపేట)**